విద్యార్థుల నుంచి కూరగాయలు కొనుగోలు చేస్తున్న కలెక్టర్

మోడల్ కూరగాయల సంత ప్రారంభం

కమాన్‌చౌరస్తా, మార్చి 17 : కరీంనగర్‌లోని కశ్మీర్‌గడ్డ రైతు బజార్‌లో సోమవారం ప్రభుత్వ పాఠశాలల్లో పండించిన కూరగాయలతో విద్యార్థినీ విద్యార్థులు ఏర్పాటుచేసిన మోడల్ వెజిటేబుల్ మార్కెట్‌ను కలెక్టర్ పమేలా సత్పతి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ కూరగాయల సంత జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో జన్య ఫౌండేషన్ సహకారంతో ఏర్పాటు చేశారు. కలెక్టర్ కూరగాయల విక్రయ స్టాళ్లను సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, విద్యార్థులు రైతుల కష్టాలను తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి జనార్దన్ రావు, జిల్లా సైన్స్ అధికారి జైపాల్ రెడ్డి, కోఆర్డినేటర్స్ అశోక్ రెడ్డి, శ్రీనివాస్, జన్య ఫౌండేషన్ ఆపరేషన్ మేనేజర్ సురేందర్, విద్యాశాఖ అధికారులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

టీజీవో డైరీ ఆవిష్కరించిన కలెక్టర్

తిమ్మాపూర్, మార్చి 17: ఎల్ఎండీ కాలనీలోని ఇరిగేషన్ సర్కిల్ కార్యాలయంలో తెలంగాణ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన డైరీని కలెక్టర్ పమేలా సత్పతి.. అధికారులు, ఉద్యోగ సంఘ నాయకులతో కలిసి సోమవారం సాయంత్రం ఆవిష్కరించారు. ప్రభుత్వ పథకాల అమలులో ఉద్యోగుల సేవలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, టీజీవో రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాస్, టీఎన్జీవో చైర్మన్ మారం జగదీశ్వర్, నాయకులు సత్యనారాయణ, మడిపల్లి కాళిచరణ్, ఎడ్ల రవీందర్‌రెడ్డి, దారం శ్రీనివాస్‌రెడ్డి, శ్యాం, లక్ష్మణ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం పెట్టాలి

తిమ్మాపూర్, మార్చి 17: గురుకులాల్లో నాణ్యమైన భోజనం పెట్టాలని.. ఎక్కడా తేడా రావద్దని గురుకుల సిబ్బందిని కలెక్టర్ ఆదేశించారు. సోమవారం రాత్రి తిమ్మాపూర్‌లోని మహాత్మాజ్యోతిబాపూలే గురుకుల బాలికల పాఠశాలను అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్‌తో కలిసి సందర్శించారు. హాస్టల్ వసతులు, సౌకర్యాలు, కిచెన్, సరుకుల స్టోరేజీగదిని పరిశీలించారు. విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

ప్రజావాణిలో దరఖాస్తుల వెల్లువ

కలెక్టరేట్, మార్చి 17 : జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో మొత్తం 253 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో అత్యధికంగా రెవెన్యూ అధికారులు, భూ ఆక్రమణలు, పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదంటూ వచ్చిన ఫిర్యాదులే ఉన్నాయి. వీటన్నిటినీ ఓపికగా పరిశీలించిన కలెక్టర్ పమేలా సత్పతి, వచ్చే వారంలోగా మరోసారి బాధితులు ప్రజావాణికి రాకుండా పరిష్కారమార్గాలు చూపాలని అధికారులను ఆదేశించారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో మెరుగైన ర్యాంకు సాధించాలి

కార్పొరేషన్, మార్చి 17: కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న స్వచ్ఛ సర్వేక్షణ్‌లో నగరపాలక సంస్థకు మొదటి ర్యాంకు వచ్చేలా కృషి చేయాలని, ఇందులో ప్రజలను భాగస్వాములను చేయాలని నగర కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ సూచించారు. స్వచ్ఛ సర్వేక్షణ్ 2024లో భాగంగా నగరపాలక సంస్థ సమావేశమందిరంలో సోమవారం మెప్మా మహిళా సంఘ సభ్యులు, శానిటేషన్ జవానులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వే రేపటి నుంచి ప్రారంభమవుతుందని, చేపట్టాల్సిన అన్ని పారామీటర్స్ కార్యక్రమాలపై జవానులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్ ఖాదర్ మొహియుద్దీన్, అసిస్టెంట్ కమిషనర్ వేణుమాధవ్, తదితరులు పాల్గొన్నారు.

పన్ను చెల్లించని ప్రకటన బోర్డులు తొలగించాలి

నగరపాలక సంస్థలో టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులతో కమిషనర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. భవన నిర్మాణ అనుమతులు, కోర్టు సమస్యలు, ప్రకటన బోర్డుల ఏరియర్స్ చెల్లింపులు, ఎల్ఆర్ఎస్ తదితర అంశాలపై అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. నగరంలో ప్రకటన బోర్డులకు సంబంధించిన ఏరియర్స్ (ట్యాక్స్)చెల్లించకుండా ఉన్న వారికి నోటీసులు ఇచ్చి 3 రోజుల గడువు అనంతరం బోర్డులు తొలగించాలని ఆదేశించారు. ఎల్ఆర్ఎస్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. కోర్టు సమస్యలు పెండింగ్ లేకుండా క్లియర్ చేయాలన్నారు.

జాతరకు వెళ్తుండగా లారీ ఢీకొని మహిళ మృతి

తిమ్మాపూర్, మార్చి17: మండలంలోని నేదునూర్ గ్రామానికి చెందిన ఎలగందుల లచ్చవ్వ(52) సోమవారం రాత్రి 7గంటల సమయంలో నల్లగొండ జాతరకు వెళ్లేందుకు రేణికుంట స్టేజీ వద్ద ఉన్న కిరాణా దుకాణంలో కొబ్బరికాయ కొనుగోలు చేసుకుని రోడ్డు దాటుతున్నది. అదే సమయంలో రాజీవ్‌రహదారిపై కరీంనగర్ వైపు నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న లారీ అతివేగంగా వచ్చి ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందింది. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివేక్ తెలిపారు.

శ్రీ చైతన్యలో మెగా స్పోర్ట్స్ మీట్

తిమ్మాపూర్, మార్చి17: ఎల్ఎండీ కాలనీలోని శ్రీ చైతన్య ఇంజినీరింగ్ కళాశాలలో వారం రోజుల పాటు జరుగనున్న మెగా స్పోర్ట్స్ మీట్ సోమవారం అట్టహాసంగా ప్రారంభమైంది. విద్యాసంస్థల చైర్మన్ ముద్దసాని రమేశ్‌రెడ్డి జ్యోతిప్రజ్వలన చేసి క్రీడలను ప్రారంభించారు. శ్రీ చైతన్య విద్యార్థులు కేవలం విద్యలోనే కాదని, క్రీడల్లో కూడా రాణిస్తారని స్పష్టం చేశారు. స్పోర్ట్స్ మీట్‌లో భాగంగా విద్యార్థులు చేసిన మార్చ్‌ఫాస్ట్ ఆకట్టుకుంది. నృత్యాలతో ఉర్రూతలూగించారు.

మానవత్వం చాటుకున్న అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డి

శంకరపట్నం, మార్చి 17: మొలంగూర్ క్రాస్ రోడ్డు వద్ద సోమవారం రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో మొలంగూర్ గ్రామానికి చెందిన దండు కొమురయ్య, డానియెల్ అనే ఇద్దరు గాయపడగా, క్షతగాత్రులను చూసిన అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ నరేందర్‌రెడ్డి చలించి పోయారు. ప్రమాదం జరిగిన సమయంలో కరీంనగర్ నుంచి వర్ధన్నపేట్‌కు వెళ్తున్న నరేందర్‌రెడ్డి, రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ ఇద్దరినీ తన వాహనంలో హుటాహుటిన హుజూరాబాద్ ప్రభుత్వ దవాఖానకు తరలించి మానవత్వం చాటుకున్నారు.

ప్రీ ప్రైమరీ తరగతి గది ప్రారంభం

చిగురు మామిడి, మార్చి 17: చిన్న ముల్కనూరు గ్రామంలో మండల ప్రాథమిక పాఠశాలలో పీఎం శ్రీ నిధులతో ఏర్పాటుచేసిన ప్రీ ప్రైమరీ తరగతి గదిని సోమవారం డీఈవో జనార్దన్‌రావు ఎంఈవో పావనితో కలిసి ప్రారంభించారు. జిల్లాలో పీఎంశ్రీ కింద 22 పాఠశాలలు ఎంపికయ్యాయని తెలిపారు.

వ్యవసాయ పరికరాలకు దరఖాస్తు చేసుకోవాలి

గంగాధర/చొప్పదండి, మార్చి 17 : రాష్ట్రీయ కృషి వికాస్ యోజనలో భాగంగా సబ్ మిషన్ ఆన్ అగ్రికల్చర్ మెకానిజమ్ పథకం ద్వారా చిన్న, సన్నకారు మహిళా రైతులకు వ్యవసాయ శాఖ వ్యవసాయ పరికరాలు అందజేయనున్నట్లు ఏడీఏ ప్రియదర్శిని, చొప్పదండి మండల వ్యవసాయ శాఖ అధికారి వంశీకృష్ణ సోమవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ఇందుకోసం చొప్పదండి నియోజకవర్గంలోని గంగాధర, రామడుగు, చొప్పదండి మండలాలకు చెందిన అర్హులైన మహిళా రైతులు ఆయా మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఉత్సాహంగా రాష్ట్రస్థాయి హాకీ పోటీలు

హుజూరాబాద్ టౌన్, మార్చి 17: సీనియర్ హాకీ క్రీడాకారుడు మోటపోతుల రమేశ్ స్మారకార్థం పట్టణంలో నిర్వహిస్తున్న 8వ సీనియర్ రాష్ట్ర స్థాయి మెన్ హాకీ చాంపియన్ షిప్ పోటీల్లో కరీంనగర్ జట్టు సెమీస్‌కు చేరుకుంది. మంగళవారం సెమీ ఫైనల్స్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సోమవారం ఏసీపీ హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్ జీ హాజరై పోటీలను తిలకించారు. 35 మంది హుజూరాబాద్ క్రీడాకారులకు హ్యుమానిటీ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు టీషర్టులు అందజేశారు.

సీతారాముల కల్యాణానికి గోటితో తలంబ్రాలు

కరీంనగర్ రూరల్, మార్చి 17: కరీంనగర్ తీగలగుట్టపల్లిలోని కోదండరామ స్వామి ఆలయంలో ఏప్రిల్ 6న జరిగే సీతారాముల కల్యాణానికి ప్రత్యేకంగా తలంబ్రాలను తయారు చేసే కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. ఇందులో భాగంగా వరి ధాన్యం గోటితో ఒలిచి, తలంబ్రాలను సిద్ధం చేస్తుండగా, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రజల పక్షాన ప్రశ్నిస్తే సస్పెండ్ చేస్తారా?

- మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి సస్పెన్షన్ సిగ్గుచేటు
- బీఆర్ఎస్ నేతల మండిపాటు

గంగాధర: మధురానగర్ చౌరస్తాలో కేసీఆర్, కేటీఆర్, జగదీశ్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

రామడుగు: బీఆర్ఎస్ నాయకులతో కలిసి రోడ్డుపై బైఠాయించిన మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

గంగాధర, మార్చి 17 : అసెంబ్లీలో ప్రజల పక్షాన ప్రశ్నించిన మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డిని సస్పెండ్ చేయడం సిగ్గుచేటని బీఆర్ఎస్ నాయకులు మండిపడ్డారు. దీనిపై నిరసన తెలిపితే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి దిష్టి బొమ్మలను దహనం చేయడం దుర్మార్గమని దుయ్యబట్టారు. సోమవారం మండలంలోని మధురానగర్ చౌరస్తాలో బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు మేచినేని నవీన్‌రావు ఆధ్వర్యంలో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. అనంతరం గంగాధర పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో నాయకులు కంకణాల విజేందర్ రెడ్డి, మడ్లపెల్లి గంగాధర్, వేముల దామోదర్, యండీ నజీర్, ముక్కెర మల్లేశం, రామిడి సురేందర్, ఆకుల శంకరయ్య, శ్రీమల్ల మేఘరాజు, వడ్లూరి ఆదిమల్లు, పొట్టల కనక య్య, బొల్లాడి శ్రీనివాస్‌రెడ్డి, పుట్కం రవీంద్రనాథ్ ఠాగూర్, దోమకొండ మల్లయ్య, గంగాధర మోహన్ తదితరులు పాల్గొన్నారు.

రామడుగు, మార్చి 17: మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి సస్పెన్షన్‌పై సోమవారం రామడుగు మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు గంట్ల జితేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఈ కార్యక్రమానికి హాజరైన మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ బీఆర్ఎస్ నాయకులతో కలిసి నిరసన తెలిపారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. తెలంగాణ తొలి సీఎం కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, జగదీశ్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మార్కొండ కిష్టారెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ మామిడి తిరుపతి, ఏఎంసీ వైస్ చైర్మన్ చాడ ప్రభాకర్‌రెడ్డి, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంలో పోలీసుల రాజ్యం

- మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్
- బీఆర్ఎస్ నాయకులకు పరామర్శ

చొప్పదండి, మార్చి 17: కాంగ్రెస్ ప్రభుత్వంలో పోలీస్ వ్యవస్థ ఇష్టారాజ్యంగా పనిచేస్తున్నదని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ మండిపడ్డారు. అసెంబ్లీ నుంచి మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి సస్పెన్షన్‌కు నిరసనగా పట్టణంలోని తెలంగాణ చౌరస్తా వద్ద కాంగ్రెస్ ప్రభుత్వం దిష్టిబొమ్మ దహనం చేసే క్రమంలో పోలీసులకు బీఆర్ఎస్ నాయకులకు మధ్య తోపులాట జరుగగా, బీఆర్ఎస్ నాయకులను పోలీసులు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పోలీస్ స్టేషన్‌కు వచ్చి బీఆర్ఎస్ నాయకులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బీఆర్ఎస్ నాయకుల దిష్టిబొమ్మలు దహనం చేసిన కాంగ్రెస్ నాయకులపై పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకున్నారో చెప్పాలన్నారు. వారికో న్యాయం.. మాకో న్యాయమా అని ప్రశ్నించారు. ఎన్ని కేసులు పెట్టినా ఎన్నికల హామీలు నెరవేర్చేదాకా కొట్లాడుతూనే ఉంటామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఏనుగు రవీందర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

శాంతియుతంగా నిరసన తెలిపితే అరెస్టులా?

బీఆర్ఎస్ నాయకులను పోలీస్‌స్టేషన్‌కు లాక్కొని తీసుకుపోతున్న పోలీసులు

- అధికార పార్టీకి ఒక రూలు... ప్రతిపక్షానికి ఇంకో రూలా?
- జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రవీందర్ రెడ్డి

చొప్పదండి, మార్చి 17: ప్రజాస్వామ్యబద్ధంగా శాంతియుతంగా నిరసన తెలిపితే అరెస్టులు చేయడం దారుణమని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఏనుగు రవీందర్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు.. జగదీశ్ రెడ్డి, కేటీఆర్ దిష్టిబొమ్మలను దహనం చేస్తే వారిని అరెస్టు చేయని పోలీసులు తమను మాత్రం అరెస్టు చేయడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. సోమవారం చొప్పదండి పట్టణంలోని తెలంగాణ చౌరస్తాలో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి చిత్రపటాలకు బీఆర్ఎస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. అనంతరం జగదీశ్ రెడ్డి సస్పెన్షన్‌పై నిరసన తెలుపుతుంటే చొప్పదండి సీఐ ప్రకాశ్ గౌడ్ నేతృత్వంలో పోలీసులు అక్కడికి చేరుకొని బలవంతంగా ఏనుగు రవీందర్ రెడ్డితో పాటు బీఆర్ఎస్ కార్యకర్తలను అరెస్టు చేసే క్రమంలో కొంత ఉద్రిక్త వాతావరణం నెలకొంది. రవీందర్ రెడ్డి, పోలీసుల మధ్య వాగ్వాదం జరిగింది. తాము శాంతియుతంగా నిరసన కార్యక్రమం చేస్తున్నామని, తమను ఎందుకు అరెస్టు చేస్తున్నారంటూ రవీందర్ రెడ్డి పోలీసులను నిలదీశారు. అనంతరం నాయకులను అరెస్టు చేసిన పోలీసులు చొప్పదండి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా రవీందర్ రెడ్డి మాట్లాడుతూ, ఎన్ని కేసులు పెట్టినా తాము ప్రజల పక్షాన నిలుస్తూనే ఉంటామన్నారు. మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పోలీస్ స్టేషన్‌కు చేరుకొని అరెస్టు అయిన నాయకులను విడిపించారు. కార్యక్రమంలో విండో చైర్మన్ మినుపాల తిరుపతిరావు, పార్టీ మండలాధ్యక్షుడు వెల్మ శ్రీనివాస్ రెడ్డి, మార్కెట్ మాజీ చైర్మన్ అరెల్లి చంద్రశేఖర్, గడ్డం చుక్కారెడ్డి, మార్కెట్ మాజీ వైస్ చైర్మన్ కొత్త గంగారెడ్డి, మాజీ ఎంపీపీ చిలుక రవీందర్, మాజీ జడ్పీటీసీ మాచర్ల సౌజన్య– వినయ్ కుమార్, పట్టణాధ్యక్షుడు లోక రాజేశ్వర్ రెడ్డి, యువజన సంఘాల సమితి అధ్యక్షులు బంధారపు అజయ్ కుమార్, మారం యువరాజు యాదవ్, గన్ను శ్రీనివాస్ రెడ్డి, బిసవేణి రాజశేఖర్, సిపెల్లి గంగయ్య, ఎండి జహీర్, కొత్తూరి నరేశ్, నరేశ్ రావణ్, స్వామి, పంబాల రవితేజ, మొత్తం కుమార్‌తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఆరోపణలు మానుకోకపోతే ఊరుకోం

చిగురుమామిడి, మార్చి 17 : హుస్నాబాద్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులకు సంబంధించి కాంగ్రెస్ నాయకులు అర్థరహితమైన ఆరోపణలు మానుకోకపోతే ఊరుకోమని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మామిడి అంజయ్య హెచ్చరించారు. మండల కేంద్రంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయలేక కాంగ్రెస్ నాయకులు అర్థరహిత ఆరోపణలతో పబ్బం గడుపుతున్నారని దుయ్యబట్టారు. సమావేశంలో నాయకులు ఆకవరం శివప్రసాద్, సన్నిల్ల వెంకటేశం, ఎస్కే సిరాజ్, రామోజు కృష్ణమాచారి, బోయిని రమేశ్, బెజ్జంకి రాంబాబు, బోయిని రమేశ్, శ్యామకూర సంపత్ రెడ్డి, ముస్కుల కృష్ణారెడ్డి, గీట్ల తిరుపతి రెడ్డి, తాటికొండ సందీప్ రెడ్డి, బొట్ల రవీందర్ ఉన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

హుజూరాబాద్ టౌన్, మార్చి17: ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య సూచించారు. పట్టణంలోని 22వ వార్డులో స్వచ్ఛ సర్వేక్షణ్–2025 కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. తడి, పొడి చెత్తను వేరు చేసి పారిశుధ్య కార్మికులకు అందించాలన్నారు. మాజీ కౌన్సిలర్ పైళ్ల వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.

పంటల పరిశీలన

చిగురుమామిడి, మార్చి 17: నవాబుపేట గ్రామంలో ఎండిన వరి, మక్క పంటలను బీఎస్పీ ఆధ్వర్యంలో నియోజకవర్గ ఇన్‌చార్జి రవీందర్ సోమవారం పరిశీలించారు. గౌరవెల్లి ప్రాజెక్టు సత్వరమే పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

ట్యాబ్స్ చోరీని 24 గంటల్లో ఛేదించిన పోలీసులు

నిందితుడి నుంచి స్వాధీనం చేసుకున్న ట్యాబ్‌లతో సీఐ లక్ష్మీనారాయణ, పోలీస్ సిబ్బంది

- నిందితుడి నుంచి 23 ట్యాబ్స్ స్వాధీనం, రిమాండ్‌కు తరలింపు

మానకొండూర్, మార్చి 17: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో జరిగిన ట్యాబ్స్ చోరీ కేసును మానకొండూర్ పోలీసులు 24 గంటలలో ఛేదించారు. నిందితుడి నుంచి 23 ట్యాబ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. స్థానిక సీఐ లక్ష్మీనారాయణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కొండపల్కల గ్రామానికి చెందిన ఓ విద్యార్థి మానకొండూర్ జడ్పీహెచ్ఎస్(బాలురు)లో చదువుతూ స్థానిక బీసీ సమీకృత వసతి గృహంలో ఉంటున్నాడు. విద్యార్థుల కోసం ప్రభుత్వం ఇటీవల ట్యాబ్స్‌ను పంపిణీ చేసింది. కాగా, పదిరోజుల క్రితం ప్రధానోపాధ్యాయుడు విద్యార్థులకు చూపించిన ట్యాబ్స్‌పై ఆ విద్యార్థి కన్నేశాడు. ఎలాగైనా వాటిని దొంగిలించాలని పథకం పన్నాడు. వాటిని హెచ్ఎం ఎక్కడ భద్రపరుస్తున్నాడో గమనించాడు. ఇటీవల హోలీ పండుగ సందర్భంగా పాఠశాలకు సెలవుదినం కావడంతో హాస్టల్‌లో పర్మిషన్ తీసుకుని 13న ఇంటికి వెళ్లాడు. అదే రోజు రాత్రి పాఠశాలకు చేరుకుని వెంటిలేటర్ పగలకొట్టి 23 ట్యాబ్స్ ఎత్తుకెళ్లాడు. వాటిని కొండపల్కల గ్రామశివారులోని రామునిగుట్టపైన దాచిపెట్టాడు. పోలీస్ బృందం అన్ని కోణాల్లో విచారణ జరిపి 24 గంటల్లో కేసును ఛేదించింది. నిందితుడి నుంచి స్వాధీనం చేసుకున్న 23 ట్యాబ్స్‌ను పాఠశాల హెచ్ఎం శ్రీనివాస్‌కు సీఐ లక్ష్మీనారాయణ అందజేశారు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్ తరలించినట్లు సీఐ తెలిపారు.

NOTICE
IN THE COURT OF THE HON'BLE PRL. JUNIOR CIVIL JUDGE AT SIRCILLA
O.S. No. 167 of 2024
Between:
Pilli Buchamma ...Plaintiff
And
The Thasildar, Ellanthakunta Mandal District: Rajanna Sircilla & Another ...Defendants
To,
To whom so ever it may concern
Take notice that the above named plaintiff filed above suit against you for declaration of legal heir of the deceased person by name Pilli Rajamma in respect of suit property i.e. House bearing door no. 3-67, along with open place, totally measuring 242 sq.yards, situated at Vanthadpula v/o Ellan thakunta Mandal, District: Rajanna Sircilla and the same is posted on: 28-03-2025 at 10:30 AM for your appearance.
Therefore, you are hereby informed to appear either in person or through an advocate before this Hon'ble Court on the said date failing which you will be set ex-parte and suit will be proceeded against in your absence.
// By order of the court //
Sd/- **BADE KANTHAIAH,** Advocate
Rajanna Sircilla, Cell: 96660 33436

సంస్కృతానికి ప్రపంచాన్ని నడిపే శక్తి

పురస్కారం అందజేస్తున్న నాగఫణి శర్మ తదితరులు

కమాన్‌చౌరస్తా, మార్చి 17 : సంస్కృత భాషకు ప్రపంచాన్ని నడిపే శక్తి ఉన్నదని, అది ప్రతి భారతీయుడు గర్వించదగ్గ విషయమని అవధాని మాడుగుల నాగఫణి శర్మ పేర్కొన్నారు. ఉస్మానియా విశ్వ విద్యాలయం హైదరాబాద్‌లోని సంస్కృత అకాడమీలో శ్రీ భాష్యం విజయ సారథి స్మారక పురస్కారం ఆచార్య హరేకృష్ణ శతపతికి అందజేశారు. ఈ కార్యక్రమానికి పెన్నా మధుసూదన్ అధ్యక్షత వహించారు. అకాడమీలో వైవిధ్య కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అనంతరం, విజయ సారథి సమగ్ర సాహిత్యం మొదటి గ్రంథం ఆవిష్కరించారు. అకాడమీ అధ్యక్షుడు పెన్నా మధుసూదన్ మాట్లాడుతూ, శ్రీ భాష్యం ఆచరణను ముందుకు తీసుకెళ్తున్న వరప్రసాద్‌ను అభినందించారు. కార్యక్రమంలో శ్రీ భాష్యం వరప్రసాద శర్మ, కేఎస్ అనంతా చార్య, వరలక్ష్మి, గిరిజా మనోహర్ బాబు, యాదగిరి ఆచార్య, సర్వ వైదిక సంస్థాన సభ్యులు, పండితులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తహసీల్ కార్యాలయాల ఎదుట ఆశ వర్కర్స్ ధర్నా

విద్యానగర్/మానకొండూర్ రూరల్/ చిగురుమామిడి/శంకరపట్నం, మార్చి 17: తెలంగాణ ఆశ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలోని హామీలు నెరవేర్చాలనే డిమాండ్‌తో ఆశ కార్యకర్తలు సోమవారం జిల్లాలోని వివిధ తహసీల్ కార్యాలయాల ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం తహసీల్ కార్యాలయాల్లో అధికారులకు వినతి పత్రాలు అందజేసి, తమ డిమాండ్లను ప్రభుత్వానికి విన్నవించాలని కోరారు. రూ.18 వేల ఫిక్స్‌డ్ వేతనం ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.

రాష్ట్రస్థాయి స్కౌట్ స్టాఫ్ మెంబర్‌గా మల్లేశం

కొత్తపల్లి, మార్చి 17 : ఈనెల 10 నుంచి 16 వరకు మేడ్చల్ జిల్లాలోని భారత్ స్కౌట్స్ గైడ్స్ రాష్ట్ర శిక్షణ ప్రాంగణంలో జరిగిన బేసిక్, అడ్వాన్స్‌డ్ కోర్స్ ఫర్ స్కౌట్ మాస్టర్స్, గైడ్ కెప్టెన్స్ ఏడు రోజుల శిబిరానికి స్టాఫ్ మెంబర్‌గా గంగారపు మల్లేశం ఎంపికయ్యాడు. రాష్ట్ర ట్రైనింగ్ కమిషనర్ మోహన్‌రావు ఆధ్వర్యంలో గంగారపు మల్లేశం రాష్ట్రంలోని పలు జిల్లాల స్కౌట్ మాస్టర్లకు శిక్షణ ఇచ్చినందుకు గానూ రాష్ట్రస్థాయి స్కౌట్ స్టాఫ్ మెంబర్‌గా ఎంపిక చేశారు.

అంగన్‌వాడీ కేంద్రంలో విచారణ

- 'నమస్తే' కథనానికి స్పందన

రామడుగు, మార్చి 17: 'అంగట్లో అంగన్‌వాడీ కోడిగుడ్లు' శీర్షికన సోమవారం నమస్తే తెలంగాణలో ప్రచురితమైన కథనానికి ఐసీడీఎస్ అధికారులు స్పందించారు. గంగాధర ఐసీడీఎస్ సెక్టార్ ఏసీడీపీవో నర్సింగరాణి రామడుగు మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి విచారణ చేపట్టారు. దీనిపై సదరు అంగన్‌వాడీ టీచర్ జవాబిస్తూ ఈ నెల 13న అంగన్‌వాడీ కేంద్రంలో 33 మంది లబ్ధిదారులకు 15 రోజులకు 8 చొప్పున కోడిగుడ్లను పంపిణీ చేశామని, తన కోడలు కూడా లబ్ధిదారు కావడంతో ఆమె సైతం కోడిగుడ్లను తీసుకెళ్లినట్లు తెలిపారు. కోడలు తీసుకెళ్లిన కోడిగుడ్లను తన కొడుకు కిరాణా షాపులో పెట్టి విక్రయించి ఉంటాడని పేర్కొన్నారు. ఇక్కడ ఏసీడీపీవోతో పాటు సూపర్‌వైజర్ శశికిరణ్మయి ఉన్నారు.

కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపునకు సర్వే

కొత్తపల్లి, మార్చి 17: కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపు ఉద్యమంలో భాగంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ వెంకటరమణ సోమవారం కొత్తపల్లిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇంటింటి కుటుంబ సర్వేను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలతో మాట్లాడుతూ, నేటి నుంచి మార్చి 30 వరకు ఈ సర్వే కొనసాగుతుందని, దీనిలో ఆరోగ్య కార్యకర్తలందరూ పాల్గొని ప్రతి ఇంటిని సందర్శించాలన్నారు. అనంతరం డీఎంహెచ్‌వో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం రికార్డులను, లేబర్ రూం, ఫార్మసీ స్టోర్స్‌ను పరిశీలించారు.

సెయింట్ జార్జ్‌లో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

కొత్తపల్లి, మార్చి 17 : కొత్తపల్లిలోని సెయింట్ జార్జ్ ఇంటర్నేషనల్ పాఠశాల (సీబీఎస్ఈ) రేకుర్తి, విద్యానగర్, తీగలగుట్టపల్లి బ్రాంచ్‌లలో విద్యార్థుల గ్రాడ్యుయేషన్ డే వేడుకలు సోమవారం రాత్రి కనుల పండువగా సాగాయి. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం, సెయింట్ జార్జ్, ప్యారడైజ్ విద్యా సంస్థల చైర్మన్ డా. ఫాతిమారెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలు ప్రారంభించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జిలు సంగీత, సంధ్య, స్వప్న, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బస్సులో నుంచి కింద పడిన విద్యార్థిని

శంకరపట్నం, మార్చి 17: ఆర్టీసీ బస్సులో నుంచి ఓ ఇంటర్ విద్యార్థిని కింద పడిన ఘటన మండలంలోని ముత్తారం గ్రామంలో చోటు చేసుకున్నది. స్థానికుల కథనం ప్రకారం.. ముత్తారం గ్రామానికి చెందిన కనకం మేఘన అనే విద్యార్థిని ఇంటర్ మీడియట్ చదువుతున్నది. ప్రస్తుతం ఇంటర్ పరీక్షలు జరుగుతున్నందున, కరీంనగర్‌లోని పరీక్ష సెంటర్‌లో సోమవారం పరీక్ష రాసి సాయంత్రం ఇంటికి తిరిగి వస్తుండగా, ముత్తారం గ్రామంలోని మూల మలుపు వద్ద బస్సు డ్రైవర్ సడెన్ బ్రేక్ వేయగానే మేఘన ప్రమాదవశాత్తు బస్సులో నుంచి కింద పడింది. బాలికకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే బస్సులో ఉన్న ప్రయాణికులను మరో బస్సులో గమ్యస్థానాలకు పంపించి మేఘనను చికిత్స కోసం కేశవపట్నంలోని ఓ దవాఖానకు తరలించారు.

సజ్జనార్‌ను తొలగించైనా విగ్రహాలు ఆవిష్కరించాలి

తిమ్మాపూర్, మార్చి17: మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన విగ్రహాలను ఆవిష్కరించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు బీ ప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో జేఏసీ నాయకులు చేపట్టిన దీక్షకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌ను తొలగించైనా విగ్రహాలను ఆవిష్కరించాలన్నారు. ఒక దళిత వ్యక్తి ఎమ్మెల్యేగా ఉండి బాధ్యత లేకుండా ఉంటున్నారన్నారు. అనంతరం జేఏసీ, సీపీఎం నాయకులు ఆశ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని తహసీల్దార్ విజయ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు.

ఉపాధి కూలీలకు ట్రైనింగ్

హుజూరాబాద్ టౌన్, మార్చి 17: పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో డీఆర్‌డీఏ, జమ్మికుంట కేవీకే ఆధ్వర్యంలో ఉన్నతి ట్రైనింగ్ ప్రోగ్రాం సోమవారం ఏర్పాటు చేశారు. వివిధ గ్రామల నుంచి 2019–2025 సంవత్సరాల్లో వంద పని దినాలను పూర్తి చేసిన 44 మంది ఉపాధి కూలీలను గుర్తించి, కూలీల కుటుంబాలకు డెయిరీ, వెర్మి కంపోస్ట్ తయారీపై శిక్షణ అందించారు.

పౌల్ట్రీఫాంలో చిన్నారులకు వైద్య పరీక్షలు

చిగురుమామిడి, మార్చి 17: మండల కేంద్రంలోని పాంబండ వద్ద గల శ్రీ సాయి పౌల్ట్రీ ఫాంలో బీహార్ నుంచి వలస వచ్చి పని చేస్తున్న కూలీల పిల్లలకు కలెక్టర్ ఆదేశాల మేరకు మండల ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో డాక్టర్ ఏంజెల్ ప్రిసీల, గిరిజ సోమవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. మందులు అందజేశారు.

అట్టహాసంగా 'ఆరంభ్'

నృత్యం చేస్తున్న చిన్నారులు

కమాన్‌చౌరస్తా, మార్చి 17 : జిల్లా కేంద్రంలోని మంకమ్మతోటలోని పారమిత లిటిల్ జీనియస్ పాఠశాలలో 'ఆరంభ్' పేరుతో నిర్వహించిన వార్షికోత్సవ వేడుకలు అట్టహాసంగా సాగాయి. ఈ వేడుకలను పారమిత, ఎక్స్ ప్లోరికా విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఇనుగంటి ప్రసాద రావు ముఖ్య అతిథిగా హాజరై, ప్రారంభించారు. వేడుకల్లో భాగంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పారమిత విద్యాసంస్థల డైరెక్టర్లు ప్రసూన, అనూకర్ రావు, రశ్మిత, టీఎస్వీ రమణ, వినోదరావు, రాకేశ్ ప్రసాద్, ప్రాచీ, వీయూఎం ప్రసాద్, హన్మంతరావు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

భక్తుల ఇంటి వద్దకే రాములవారి తలంబ్రాలు

తెలంగాణచౌక్, మార్చి 17: భద్రాచలం రాములవారి కళ్యాణ తలంబ్రాలను భక్తుల ఇంటి వద్దకే చేరవేయనున్నట్లు ఆర్టీసీ రీజినల్ మేనేజర్ బి.రాజు తెలిపారు. కార్గో ఉమ్మడి జిల్లా టీం మేనేజర్ రాజు ఆధ్వర్యంలో సిబ్బంది ఆర్ఎం కార్యాలయంలో సోమవారం ఆర్ఎంను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాముల వారి తలంబ్రాలను ఆర్ఎం బుక్ చేశారు. అనంతరం మాట్లాడుతూ, భద్రాచలం రాముల వారి కళ్యాణ తలంబ్రాల కోసం భక్తులు అన్ని కార్గో సెంటర్లలో లేదా ఆన్‌లైన్‌లో రూ.151 చెల్లించి ముందస్తు బుక్ చేసుకునే వెసులుబాటు ఉందన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

తెలంగాణచౌక్, మార్చి17: డిపో–2 పరిధిలోని ప్రయాణికుల నుంచి సలహాలు, ఫిర్యాదులు, సూచనలు తీసుకునేందుకు డిపో–1 కార్యాలయంలో మంగళవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిపో–2 మేనేజర్ మల్లయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిపో–2 పరిధిలోని కరీంనగర్, చొప్పదండి, ధర్మారం, గంగాధర మండలాల ప్రయాణికులు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల మధ్య సెల్ 9959225921 నంబరుకు కాల్ చేయవచ్చని పేర్కొన్నారు. ప్రయాణికుల సలహాలు స్వీకరించి మెరుగైన సేవలందిస్తామని తెలిపారు.

బస్సు పునరుద్ధరించాలని వినతి

జమ్మికుంట, మార్చి17: హైదరాబాద్ వెళ్లే ప్రయాణికుల కోసం జమ్మికుంట–హుజూరాబాద్ ఆర్టీసీ బస్సు నడిచేదని, సదరు బస్సును పునరుద్ధరించాలని సీపీఎం మండల సహాయ కార్యదర్శి వడ్లూరి కిశోర్, నాయకులు రమేశ్, అరవింద్, తదితరులు హుజూరాబాద్ డిపో మేనేజర్ రవీంద్రనాథ్‌ను సోమవారం కలిశారు. బస్సును తిరిగి నడిపించాలంటూ వినతి పత్రం అందించారు. అనంతరం మాట్లాడుతూ.. మంత్రి పొన్నం ప్రభాకర్ బస్సును పునరుద్ధరిస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

హైకోర్టు ఆదేశాలను అమలు చేయాలని వినతి

కరీంనగర్ కలెక్టరేట్, మార్చి 17 : హైకోర్టు ఉత్తర్వులమేరకు ఇంటిగ్రేటెడ్ సీనియార్టీ జాబితాలో మొదటి ప్రాధాన్యత కల్పిస్తూ, వెంటనే ఉద్యోగావకాశాలు కల్పించాలని ఎల్ఎండీ నిర్వాసితులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం సుమారు 50 మందికి పైగా ఉద్యోగార్థులు కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణికి తరలివచ్చి, కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన కలెక్టర్ సంబంధితాధికారులను పిలిచి సత్వర న్యాయం చేయాలంటూ ఆదేశించినట్లు వారు తెలిపారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
PLOT FOR SALE
★హైదరాబాద్‌లో మరో న్యూయార్క్ లాంటి 4వ సిటీ
మహేశ్వరం, ముచ్చర్ల, కందుకూరులో ప్లాట్లు, విల్లాలు & ఇండ్లు అమ్మబడును. శ్రీశైలం హైవేకి మహర్దశ... ఆలస్యం చేయకండి... నేడు తక్కువ ధరలో కొనండి – రేపు కోటీశ్వరులు కండి. మహేశ్వరంలో ఓపెన్ ప్లాట్ రూ. 6,000/–కే గజం. సంప్ర: 8008091512.
NT-330660

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189